ఫిజియోథెరపీతో మెరుగైన ఆరోగ్యం


ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: కడప నగరంలోని అపూర్వ కళ్యాణ మండపంలో ఫిజియోథెరపీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం, ఏపీ ఫిజియోథెరపిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కడప మేయర్ సురేష్ బాబు ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ఫిజియోథెరపిస్ట్ వైద్యులను అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. రాష్ట్రంలో ప్రత్యేక ఫిజియోథెరపీ కౌన్సిల్‌ను ఏర్పాటు చేసే విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోతామన్నారు. వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డా. శివానాయక్ మాట్లాడుతూ ప్రాథమిక వైద్య కేంద్రం, విలేజ్ క్లీనిక్‌లు, ఏరియా, జిల్లా ఆసుపత్రుల్లో ఫిజియోథెరపిస్ట్ వైద్యులను నియమించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కొత్తగా వస్తున్న, క్లీనికల్ అటాచ్‌మెంట్ లేని ఫిజియోథెరపీ కాలేజీలను రద్దు పరిచి, ఇప్పటికే ఉన్న కాలేజీల్లో సరైన సౌకర్యాలు కల్పించాలన్నారు. సరైన ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్న ఫిజియోథెరపిస్ట్‌లకు మొదటి ప్రాధాన్యతగా ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య విభాగం నగర అధ్యక్షుడు డా. సతీష్‌రెడ్డి, ఫిజియోలు ఇర్ఫాన్, రేణుక, శివశంకర్, పెంచలయ్య, మధు, వంశీ, శేఖర్, వెంకటేష్, సింధు, సావిత్రి, జగన్ రాథోడ్, క్రిష్టా నాయక్‌లు పాల్గొన్నారు.

కడప ఎడ్యుకేషన్: రామిరెడ్డి ఫిజియోథెరపి కళాశాల ఎందరినో నిష్ణాతులైన ఫిజియోథెరపిస్టులను తయారు చేస్తుందని ఆ కళాశాల సెక్రటరీ జయసుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం రామిరెడ్డి ఫిజియోథెరపీ కళాశాలలో ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కళాశాల చైర్మన్ ఈశ్వరరెడ్డి, విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఫిజియోథెరపీ ప్రాముఖ్యత చాలా ఎక్కువగా ఉందన్నారు. కళాశాల చైర్మెన్ ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో ఫిజియోథెరపీకి బంగారు భవిష్యత్తు ఉంటుందని అన్నారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ యుగంధర్ రెడ్డి పాల్గొన్నారు.

కడప రూరల్: ఫిజియోథెరపీతో మెరుగైన ఆరోగ్యం సమకూరుతుందని యాఫియా ఫిజియోథెరపీ కేర్ డాక్టర్ యస్ అమీర్‌బాష అన్నారు. ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక ఆ కేంద్రంలో ఉచిత శిబిరంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిజియోథెరపీ చికిత్స కోసం వచ్చిన జబర్దస్ అదిరే అభి తన భుజానికి లేజర్ చికిత్సను చేయించుకున్నారు. అలాగే ఉచిత శిబిరానికి హాజరైన మోకాలు, నడుము నొప్పులు తదితర సమస్యలు ఉన్నవారికి చికిత్సను అందజేశారు. లేజర్, ఫిజియోథెరపీపై అవగాహన కల్పించారు.

రిమ్స్‌లో ..

కడప అర్బన్: ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం కడప రిమ్స్‌లో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాన శిబిరంను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. సురేశ్వర్‌రెడ్డి, ఫిజియోథెరపీ హెచ్‌ఓడి డాక్టర్ సంపత్‌కుమార్‌లతో పాటు ఫిజియోథెరపిస్టులు, ఇతర సిబ్బంది పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రెండు ప్రైవేట్ కళాశాలలకు సంబంధించిన ఫిజియోథెరపీ విద్యార్థులు ప్రాక్టికల్ వైద్య విధానంను కడప రిమ్స్‌లోనే నిర్వహించడం, తద్వారా ఇక్కడి వైద్య సిబ్బందికి సహకరిస్తూ, పేద ప్రజలకు ఉచితంగా వైద్యాన్ని అందించడంలో కీలకపాత్ర పోషించడం అభినందనీయమన్నారు.


మాట్లాడుతున్న కళాశాల సెక్రటరీ జయసుబ్బారెడ్డి


రిమ్స్‌లో మాట్లాడుతున్న వైద్యులు

క్లుప్తంగా

నేడు రిమ్స్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

కడప కార్పొరేషన్: సబ్‌స్టేషన్లు, లైన్ల నిర్వహణ కారణంగా రిమ్స్(జీజీహెచ్) ఆసుపత్రిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఎస్‌పీడీసీఎల్ డీఈ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గమనించి ఆసుపత్రి పరిపాలనా యంత్రాగం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసు కోవాలని తెలిపారు.

బీజేపీ పాలనకు చరమ గీతం పాడుదాం


ఛలో తిరుపతికి వెళుతున్న వాహనాలకు జెండా ఊపుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: బీజేపీ పాలనకు చరమగీతం పాడుదామని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం శుక్రవారం తిరుపతిలో జరిగిన భారీ ప్రదర్శన బహిరంగ సభకు కడప నుండి బయలుదేరిన వాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ ఎన్నికల వాగ్దానాలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బషీరున్నీషా, కేసీ బాదుల్లా, సావంత్ సుధాక ర్, ఓబయ్య, మునెయ్య, వలరాజు తదితరులు పాల్గొన్నారు.

సినిమా టికెట్ అమ్మకాలలో అక్రమాలు అరికట్టాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: సినిమాలకు అధిక టికెట్ ధరలను వసూలు చేస్తున్న సినిమా థియేటర్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్‌ఐ నగర అధ్యక్షుడు షాకిర్, నగర కార్యదర్శి ఓబులేసు, నాయకులు యూసఫ్ పేర్కొన్నారు. శుక్రవారం ఈ మేర కు డీఆర్వో గంగాధర్ గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సినిమా హాల్స్ యాజమాన్యం ప్రభు త్వ నిబంధనలకు విరుద్ధంగా కొత్త సినిమాలు విడుదల చేస్తున్న నేపథ్యంలో ఇష్టానుసారంగా టికెట్ ధరలు పెంచుతున్నాయని మండిపడ్డారు.

పోస్టర్ల ఆవిష్కరణ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : రాహుల్ గాంధీ ఇచ్చిన సందేశాన్ని కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండి సుమంత్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు తిరుమలేష్, సుశీల్ కుమార్‌లు తెలిపారు. ఈ మేరకు ఇండియన్ యూత్ కాంగ్రెస్ ముద్రించిన పోస్టర్లను శుక్రవారం స్థానిక జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారు ఆవిష్కరించి మాట్లాడారు. బీజేపీ.. బ్రిటీష్ పాలనను తలపిస్తోందన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం


పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

కడప కోటిరెడ్డిసర్కిల్ : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ సునంద తెలిపారు. శుక్రవారం కడప నగరం గుంతబజారు అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాల సందర్భంగా పౌష్టికాహారం, తల్లిపాల వారోత్సవాల గురించి అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమం ద్వారా గర్భిణీలు, బాలింతలు ఆరోగ్యంగా ఉండాలని, అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని అందిస్తోందన్నారు. చిరుధాన్యాలైన కొర్రలు, రాగులు, సజ్జలు, జొన్నలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రెడ్డెమ్మ, డబ్ల్యుఎంఎస్‌కే అయేషా బేగం పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ

కడప ఎడ్యుకేషన్: కడప ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో శుక్రవారం డాక్టర్ మెంటా నరసింహులు ట్రస్టు ఆధ్వర్యంలో మెంటా నరసింహులు జ్ఞాపకార్థం అతని కుమారుడు పవన్ మెంటా ఎస్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎన్‌ఆర్‌ఐ పవన్‌మెంటా మాట్లాడుతూ తన తండ్రి జ్ఞాపకార్థం ప్రతి ఏటా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుంటామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నూర్జహాన్, ఎస్ఎస్ఎస్ కోఆర్డినేటర్స్ రాజారావు, చరిత పాల్గొన్నారు.

నీటి నిల్వలు లేకుండా చూడాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఇళ్ల పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ వైద్యుడు డాక్టర్ ప్రశాంత్ వర్ధన్ తెలిపారు. శుక్రవారం నగరంలోని నారాయణ కళాశాల పరిసర ప్రాంతాల్లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన పరిసర ప్రాంతాల్లో ఇంటింటి సర్వే నిర్వహించి మాట్లాడారు. దోమకాటు వల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే సమీపంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్, నాగరాజుపేట వైద్యులు డాక్టర్ పవన్ కల్యాణ్, ఉదయ్ కుమార్, సాయిప్రసన్న, సూపర్‌వైజర్ సర్వేశ్వర, సచివాలయ ఏఎన్ఎం లక్ష్మీదేవి, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మంపై అనుచిత వ్యాఖ్యలు దారుణం

కడప కోటిరెడ్డిసర్కిల్ : తమిళనాడు రాష్ట్ర మంత్రి ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మాన్ని, సంస్కృతిని అవమానిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేయడంపై ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో ప్రదర్శన చేపట్టి కలెక్టరేట్ వద్ద ఉదయనిధి స్టాలిన్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ ప్రపంచంలో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని, భూమి అంతా ఒకే కుటుంబమని సనాతన ధర్మం చెబుతోందన్నారు. సర్వమతాలను ఆదరించాలని, అక్కున చేర్చుకోవాలని సూచించిందన్నారు. ఇలాంటి సనాతన ధర్మాన్ని, సంస్కృతిని అవమానిస్తూ ఉదయనిధి స్టాలిన్ ఒక సభలో మాట్లాడటం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు అంచెల వెంకట సుబ్బయ్య, వెంకట్రామిరెడ్డి, బెస్తవేముల రామమహేష్, వెంకట రమణారావు, శ్రీనాథరెడ్డి, లక్ష్మణ్‌రావు, శారదమ్మ తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ, వీహెచ్‌పీఎస్ నాయకులు

మన పాలన ఇతర రాష్ట్రాలకు ఆదర్శం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి


సమావేశానికి హాజరయిన వైఎస్‌ఆర్ సీపీ నేతలు, అధికారులు, సచివాలయ సిబ్బంది


మాట్లాడుతున్న ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి

వల్లూరు: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్‌ఆర్‌సీపీ పాలన ఇతర రాష్ట్రాలకు సైతం ఆదర్శవంతంగా సాగుతోందని కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. కడపలోని డీఎస్‌ఆర్ కళ్యాణ మండపంలో వల్లూరు మండలంలోని వైఎస్‌ఆర్‌సీపీ నేతలు, అధికారులు, గృహ సారధులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కలసి శుక్రవారం నిర్వహించిన ఆత్మీయ కృతజ్ఞతా సమావేశంలో వారు మాట్లాడారు. ఏ పార్టీ ప్రభుత్వమైనా అధికారంలో వుండగా తాము చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ, ఇంకా ఏవైనా సమస్యలున్నాయా అని ఇంటింటికీ తిరిగి అడిగే సాహసం చేయదని పేర్కొన్నారు. కానీ ప్రజల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా మ్యానిఫెస్టోను రూపొందించి పూర్తి స్థాయిలో అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. కులాలు, మతాలకు , పార్టీలకు అతీతంగా పారదర్శకంగా సంక్షేమ పథకాలను అందిస్తూ ఆదర్శవంతంగా పాలన సాగుతోందన్నారు. చంద్రబాబు తాను చేసిన ఏ ఒక్క పనిని ధైర్యంగా చెప్పుకోలేని దుస్థితిలో ఉన్నారన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలు సక్రమంగా పని చేయడం వలన కమలాపురం నియోజకవర్గమంతా నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో కేవలం 653 సమస్యలను మాత్రమే ప్రజలు తెలిపారని అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుండి విశేష ఆదరణ లభించిందని పేర్కొన్నారు. రెండు సంవత్సరాల పాటు కరోనా పరిస్థితుల్లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించక పోయినా సంక్షేమంతో బాటు అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ పాలన సాగిందని అన్నారు. రాష్ట్రానికి సుపరిపాలన అందిస్తున్న వైఎస్ జగన్‌ను మరోసారి సీఎంను చేసుకోవాల్సిన అవసరాన్ని ప్రజలు గుర్తించారని, అందుకే వచ్చే ఎన్నికల్లో ఆయన వెంట వుండడానికి సిద్ధంగా వున్నారని పేర్కొన్నారు.

– నియోజకవర్గంలో రూ.5747 కోట్ల పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల సూచనల మేరకు గుర్తించిన పనులు చేపట్టడానికి ప్రభుత్వం రూ 20 లక్షలు కేటాయించింది, దానితో బాటు నియోజకవర్గం మొత్తం రూ.2 కోట్లు అదనంగా మంజూరు చేసిందన్నారు.

ఈ కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సీపీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి, జడ్పీటీసీలు నరేన్ రామాంజులురెడ్డి, వెంకట సుబ్బయ్య, సింగిల్ విండో అధ్యక్షుడు క్రిష్ణారెడ్డి, పార్టీ నేతలు ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, పాకా సురేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నేతలు, అధికారులు పాల్గొన్నారు.

అత్యవసర చికిత్సపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న భాస్కర్

కడప ఎడ్యుకేషన్: అత్యవసర చికిత్సపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని డీపీఎం డీఎంహెచ్‌ఓ భాస్కర్ సూచించారు. శుక్రవారం మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో స్టెప్ ఆధ్వర్యంలో ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రథమ చికిత్స అనేది నిపుణులైన వైద్యులు అందుబాటులో లేని సమయంలో నిర్వహించేదన్నారు. ప్రథమ చికిత్స చేయాల్సిన సందర్భాలు, విధానాలు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగమణి, సెప్ట్ మేనేజర్ సుబ్బరాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి


ఆర్‌జేడీకి వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఓబులపతి, రాష్ట్ర ఉపాధ్యక్షులు చల్లా ప్రసాద్‌రెడ్డిలు కోరారు. ఈ విషయమై శుక్రవారం పాఠశాల విద్య ఆర్‌జేడీ వెంకట క్రిష్ణారెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఇటీవల బదిలీ అయిన, పదోన్నతి పొందిన కొందరికి జీతాలు రావడం లేదన్నారు. సంబంధిత సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వయోజన విద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సోమశేఖర్‌రెడ్డితోపాటు పలువురు వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవనాన్ని పునరుద్ధరించాలి

కడప కార్పొరేషన్: కడప నగరం ఎన్‌జీవో కాలనీలో ఉన్న డా. బీఆర్ అంబేడ్కర్ సామూహిక భవనంను పునరుద్ధరించాలని జై భీమ్ మాల మహాసేన అధ్యక్షుడు పి. సంపత్ కుమార్, ప్రధాన కార్యదర్శి చైతన్య, సీహెచ్ సునీల్ అన్నారు. శుక్రవారం వారు ఆ భవనాన్ని పరిశీలించి, మరమ్మతులు చేయించాలని కోరారు. గతంలో ఇక్కడ వివాహాలు, ఫంక్షన్లు, శుభకార్యాలు జరిగేవని, అధికారుల నిర్లక్ష్యం వల్ల విలువైన భవనం పాడుబడిపోయి శిథిలావస్థకు చేరిందన్నారు. చెత్తచెదారంతో పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయన్నారు. దీన్ని పడగొట్టి కొత్త భవనం కట్టాలని డిమాండ్ చేశారు.

మనో వైజ్ఞానిక రచనలతో త్రిపురనేని ప్రత్యేక ముద్ర

కడప కల్చరల్ : తెలుగు నేలలో తొలి మనో వైజ్ఞానిక నవలా రచయిత త్రిపురనేని గోపీచంద్ అని, తన రచనలతో ఆయన ప్రత్యేక ముద్ర వేశారని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి పేర్కొన్నారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో శుక్రవారం బహుముఖ ప్రతిభాశాలి త్రిపురనేని గోపీచంద్ జయంతిని నిర్వహించారు. తొలుత త్రిపురనేని చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి మాట్లాడుతూ తండ్రి త్రిపురనేని రామస్వామి చౌదరి ప్రసిద్ధ హేతువాద రచయిత కావడం వల్ల ఆ ప్రభావం గోపీచంద్‌పై చాలా ఉందన్నారు. గోపీచంద్ రచనల్లో విశేష ఆదరణ పొందిన వాటిని ప్రస్తావించారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని పొందిన తొలి తెలుగు నవల ×పండిత పరమేశ్వర శాస్త్రి వీలునామా× కావడం విశేషమన్నారు. లైబ్రరీ అసిస్టెంట్ రమేశ్ రావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

బలిజ కార్పొరేషన్ ఏర్పాటుకు వినతి

కడప కల్చరల్ : రాష్ట్రంలో బలిజ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఐక్య కాపునాడు ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌రాష్ట్ర అధ్యక్షులు కేవీ రావు కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం తన కార్యాలయం నుంచి రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు లేఖ పంపారు. రాష్ట్రంలో అత్యధిక జనాభాగల కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలు ఉన్నాయని, గ్రేటర్ రాయలసీమలోని ఆరు ఉమ్మడి జిల్లాలైన వైఎస్సార్, కర్నూలు, అనంతపురం, చిత్తూరు, ప్రకాశం, నెల్లూరులలో 50 లక్షల బలిజ సామాజిక వర్గం ఉందన్నారు. గడిచిన అన్ని ఎన్నికల్లో వీరంతా వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేశారన్నారు. ముఖ్యమంత్రితో చర్చించి బలిజ కార్పొరేషన్ ఏర్పాటు చేసేందుకు సమ్మతించేలా చూడాలని కోరారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు

కమలాపురం: అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అందిస్తూ వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం అందరి ఆదరాభిమానాలను పొందుతోందని ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి అన్నారు. మండలంలోని కోగటం గ్రామంలో మాజీ సర్పంచ్ కరుణ్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో చింతకొమ్మదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులురెడ్డితో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో వారికి ఘనంగా స్వాగతం లభించింది. అనంతరం వారు ఇంటింటికీ తిరిగి బుక్‌లెట్ల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను గురించి వివరించి ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని తెలియచేశారు. ప్రభుత్వం మొత్తం మీ ఇంటి వద్దకు వచ్చిందని, అర్హత వుండి ఇంకా ఏవైనా పథకాలు రాకున్నా, సమస్యలేవయినా వున్నా తెలిపితే పరిష్కరిస్తామని తెలిపారు. వైఎస్‌ఆర్‌సీపీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి, మార్కెట్ యార్డు కమిటీ ఛైర్మెన్ ఎన్‌సీ పుల్లారెడ్డి, మునిసిపల్ వైస్ చైర్మెన్‌లు శ్రీనివాసులు రెడ్డి, సాదిక్, పార్టీ నేతలు పాల్గొన్నారు.

జిల్లాలో పనిచేయడం మరచిపోలేని అనుభూతి


ఎస్పీ అన్బురాజన్‌ను ఘనంగా సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలుకుతున్న పోలీసు అధికారులు, సిబ్బంది


పోలీస్ పరెడ్ గ్యాలరీని ప్రారంభం సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్పీ అన్బురాజన్


ఎస్పీ అన్బురాజన్‌ను సన్మానిస్తున్న మహిళా సంరక్షణ కార్యదర్శులు

– ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్: జిల్లాలో విధులు నిర్వహించడం మరచిపోలేని మధురానుభూతి అని బదిలీపై అనంతపురం జిల్లాకు వెళ్తున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి కడప నగరంలోని ఉమేష్‌చంద్ర కల్యాణమండపంలో జిల్లా ఎస్పీకి ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా ప్రజలు పోలీస్ అధికారులు తనపై చూపిన అభిమానం మరచిపోలేనన్నారు. విధి నిర్వహణలో జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది ఎంతో సహకారం అందించారనీ ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ, ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేర్ణాకుమార్, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శాంతియుత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించుకోవాలి

కడప సెవెన్‌రోడ్స్ : శాంతియుత వాతావరణంలో వినాయక ఉత్సవాలను నిర్వహించేందుకు శాంతి కమిటీ సభ్యులు కృషి చేయాలని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. గణేష్ ఉత్సవాల నిర్వహణపై శుక్రవారం కలెక్టరేట్‌లో శాంతి కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఉత్సవాలు సజావుగా జరిగేలా ఏర్పాట్లను చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలందరూ మట్టి విగ్రహాలను ఉపయోగించాలని ఆయన పిలుపునిచ్చారు. మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు కమిటీలు ముందుకు వస్తే నామినల్ రుసుముతో అనుమతులు ఇస్తామని చెప్పారు. సింగల్ విండో పద్ధతిలో విగ్రహాల ఏర్పాటుకు అనుమతుల మంజూరుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మత సామరస్యానికి ప్రతీకగా అన్ని మతాల ప్రజల సహకారంతో గణేష్ ఉత్సవాలలో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా ఉత్సవాలు జరిగేలా చూడాలన్నారు. నిమజ్జనం మార్గంలో కరెంట్ తీగలు, కేబుల్ వైర్లు అడ్డు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జేసీ గణేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్ చంద్, ఏఎస్పీ తుషార్ డూడి, డీ ఆర్వో గంగాధర్ గౌడ్, ట్రైనీ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.


ఉత్సవాల నిర్వహణపై మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు